# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

## ఏరు పొంగింది

"పర్లాకిమిడి గాలి ఏమైనా తగులుతోందా ఇక్కడికి?" అనడిగారు, పండు తమలపాకువంటిపంతులుగారు విశ్వవిద్యాలయం కమిషన్‌తో వచ్చి అక్కడి కాలేజీ తెలుగు డిపార్టుమెంటు తలమానికంగారిని వ్యంగ్యంగా.

తెలుగు తలమానికంగారు కంగారుగా "అట్లాంటి దేమీ లేదండి. అరసున్నల్నీ, నెరసున్నల్నీ జాగ్రత్తగా పాటిస్తున్నారు మా వాళ్ళు; బండిరాలదే కొంచెం బెడద అనుకోండి. అయినా ఎన్నడూ డిక్షనరీల్ని ఒదిలి కాపురం చెయ్యడం లేదండి మేం" అని సవినయంగా మనవిచేసినా—తెలుగు ట్యూటర్లు దిద్దిన కాంపోజిషన్ పుస్తకాల్లో "ఎన్నడు" అన్నచోట పెట్టవలసిన అరసున్నను "ఎప్పుడు" అన్న మాటలో పెట్టి ఎక్కడ ఎర్రసిరాతో దర్జాగా దిద్దారో భగవంతుడా! అన్న భయం లేకపోలేదు ఆయనకు.

పండు తమలపాకు పంతులుగారు ఎంత బందోబస్తు చేసి వెళ్ళినా- ఆ యేడు రాజమండ్రిలో పర్లాకిమిడి గాలి తుఫానులా వచ్చి పడింది.

అది శరదృతువు. వరద రావడం, వెళ్ళడం గోదావరి, స్వచ్ఛంగా కొబ్బరి బొండాం నీళ్ళలా వుండడం సక్రమంగా సలక్షణంగా జరిగిపోయాయి.

మార్కండేయ స్వామి గుడి ఎగువను పుష్కరాల రేవు దిగువను సరిగ్గా 'చిత్రాంగి' మేడ దగ్గర గోదావరి పొంగింది. సాయంకాలం బంగారపు ఎండ మీదపడి తళతళ మెరుస్తూండగా ఆ కెరటాలు ఎగసి వచ్చి మేడ గోడల్ని కొడుతున్నాయి.

అది మొదట 'పిఠాపురం మహారాజా వారి బంగళా అట! తర్వాత మునిసిపల్ హైస్కూల్.

ఆ సాయంకాలం ఆవరణ అంతా జనప్రవాహంతో నిండిపోయింది. అటు గంజాం జిల్లా మొదలు ఇటు నెల్లూరుజిల్లా హద్దుగా అక్షరాస్యులైన ఆంధ్రావళి అంతా అక్కడ ఖణాయించి ఉంది. అన్ని వయస్సులవాళ్ళూ, అన్ని అభిరుచులవాళ్లూ, అన్ని వర్గాలవాళ్ళూ పడుగూ పేకగా తిరుగుతున్నారు.

అందరి ముఖాల్లోనూ ఏదో పందెం గెలిచిన ఆనందం, పోరాటంలో నెగ్గిన ఉత్సాహం! అందరి చేతులోనూ అచ్చువేసిన రంగు రంగుల సన్మాన పత్రాల కట్టల పలకరింపులు, నవ్వులు, హాస్యాలు, లాస్యాలు, ఒక వుత్సాహ పరిమళం. ఒక వుల్లాస సుగంధం, వాతావరణమంతా అలముకుని వుంది.

ఉన్నట్టుండి జనప్రవాహం ఉప్పొంగింది.

అటు గోదావరి యింతమంది తనవారిని చూసి ఉరకలు వేస్తోంది. రెండు ప్రవాహాలమధ్య ఆ బంగళా పునాదులు కదిలిపోతున్నాయి.

అంతవరకూ కొందరు పట్టుదలతో కాపాడుకుంటూ వచ్చిన పాత పునాదుల నమ్మకాలు కదిలి బీటలువారే రోజు వచ్చింది.

ఆరోజు గిడుగు రామమూర్తి పంతులుగారి డెబ్భయ్యో జన్మదినం (సప్తతితమ) అక్కడ జరుగుతోంది.

ఆదిదంపతుల్లా శ్రీరామమూర్తి పంతులుగారు, భార్య అన్నపూర్ణమ్మగారు వేదిక మీద ఆసీనులై వున్నారు. పక్క వరసల్లో శ్రీయుతులు చిలకమర్తివారు, వడ్డాదివారు, వెంకటరత్నం నాయుడుగారు, గంగన్నగారు ఆసనాలను అలంకరించి వున్నారు.

పంతులుగారి మెడలో పడ్డ పూలదండలకు ఆయన మూపు, వీపు చాలడం లేదు. సన్మానపత్రాలను టేబిలు మొయ్యలేకుండా వుంది. ఎప్పటి కప్పుడు ఏ తెలికిచర్ల వెంకటరత్నంగారో, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారో వచ్చి దండల కోసం ఆయన మెడను, పత్రాలకోసంబల్లను శ్రమపడి ఖాళీ చేస్తున్నారు.

చెప్పొద్దూ- రాజమండ్రి పూల బజారులో ఒక పువ్వు లేదు. ప్రెస్సుల్లో ఒక్క కాగితం లేదు.

పుష్పాలూ, పత్రాలు అయాయి.

పంతులుగారు ప్రసంగించడానికి లేచారు.

పెద్దపులి లాంటి తల. దానిమీద తీర్చి చుట్టిన తలపాగా. మెడలో పట్టు పట్టీతో కైజర్ హింద్ పతకం మెరుస్తోంది. ఎవరికీ ఎదుటపడి మాట్లాడడానికి దమ్ములు లేవు. మాట్లాడినా ఆయన చెవిదాకా వెళ్ళదు.

ఆయన మాటాడింది చచ్చినట్టు వినవలసిందే— "వన్ వే ట్రాఫిక్"

"మిత్రులారా, 22 ఏళ్ళనుంచి నేను చెప్పవలసింది చెబుతూనే ఉన్నాను. బతికి ఉన్నంతవరకూ చెబుతూనే ఉంటాను. సరిగ్గా- ఈ గోదావరికి అవతలి ఒడ్డున కొవ్వూర్లో నా వాదం చెబుతూ ఉండగా నిష్కరుణంగా జెబ్బ పట్టుకు లాగి కూర్చోబెట్టారు. ఈనాడు ఇవతలి ఒడ్డున నన్నయభట్టు భారతం రాసినచోట, నేను భరించలేనంత సన్మానం చేస్తున్నారు. ఎవరిదీ సన్మానం? తెలుగువాళ్ళ జీవద్భాషది! నావెంట ఇంతమంది యువ రచయితలు సాహిత్యపరులు నిలబడి ఉన్నారంటే నా మనస్సు పొంగిపోతున్నది.

"నావాదంలో సత్యం ఉందన్నమాట! అందుకే అది బతికింది. ఇంతమందిని ఒక్క ఆవరణలోకి తెచ్చింది. గ్రాంథికం మీదనాకుద్వేషం లేదు. అదిసంస్కృతంలా మూలపు టమ్మ. వాడుక భాష మనల్నికని, పెంచిన తల్లి. కనీసం పదేళ్ళు కృషి చేస్తేగాని గ్రాంథికం వ్రాయలేరు. ఈ చిలకమర్తివారి పుస్తకాల్లో శ్రీపాదవారి పుస్తకాల్లో పేజీకి పది తప్పులు చూపించగలను. చూపించాను.

"అచ్చంగా పూర్వ పుస్తకాల భాష వ్రాస్తే అది గ్రాంథికం. మనం మాటాడుతున్నది రాస్తే అది వాడుక. రెండూ కాని దాని నేమనాలి? అది కృతక భాష. అది మనకు వద్దు. ప్రజల్లో విద్య వ్యాపించాలంటే వాడుకభాష ఒక్కటే శరణ్యం" అని కూర్చున్నారు.

ఒకప్పుడు వడ్డాదివారు "గిడుగు రామమూర్తి నుడుగు నిల్వక పోయె ఒగి జయంతి రామయోక్తి గెలిచె" అని ఛందస్సులో బంధించినా లక్షణంగా రామమూర్తి నుడుగే నిలవడం, రామయోక్తి జారడం విధి విలసితం గాబోలు. ఇద్దరూ రాములే. అయితే ఒకరి చేతిలో పరశువూ, వేరొకరి చేతిలో కోదండం వుంచి సరదా చూద్దామా?

★